

దూరంగా బాండ్‌వాయిద్యాల సంగీతం. మధ్యమధ్యలో బాణాసంచాలు కాలుస్తున్న చప్పుడు. జయజయకారాల ధ్వని. ఊరేగింపు దగ్గరకు వచ్చేస్తోంది కాబోలు.

సుశీల గాఢంగా నిట్టూర్చింది. తనకు చిన్నప్పటినుంచీ ఎందుకో ఊరేగింపులంటే చాలా ఇష్టం. బొమ్మలపెళ్లి చేసినప్పుడు బొమ్మలను ఊరేగించడానికని బాబాయిగారి నడిగి ప్రత్యేకంగా ఒక అందమైన చిన్న కారును తెప్పించుకుంది తను. ఆ చిన్నారి కారులో అలంకరించిన బొమ్మలను కూర్చో పెట్టి వింతో సంబరంతో మెల్లిగా తోసుకుంటూ ఇల్లంతా తిప్పేది. స్నేహితురాళ్లందరూ కలిసి ఊరేగింపుకు ముందు నేతిపువ్వు డబ్బాలతో డప్పులు వాయిస్తూ, కొబ్బరి బూరాలతో 'పీ — పీ...' మని వూదుతూ బయలుదేరేవాళ్ళు.

వీధిలో పెళ్లి ఊరేగింపు ఏవేళప్పుడు వచ్చినా తప్పకుండా చూసేదితను. తనకు వయసు పెరిగి కన్నెమనసులో చిలిపి ఊహలు రావడం మొదలెట్టాక, తన పెళ్లి గురించిన కలలు కంటూ ఆనందిస్తూండేది.

పూలతో చక్కగా అలంకరించిన పెద్ద కారు. అందులో సిగ్గుల పెళ్లికూతురై తను, తనవంక కొంటెగా చూస్తూ, మధ్య మధ్యలో చిన్నగా పలకరించే అందాల తన భర్త. కారుకు ముందువైపు పెద్ద బాండ్ మేళం. అటూ ఇటూ పెట్రొమాక్సు లైట్లు. మెడకంతా పట్టుచీరలూ, ధగధగలాడే నగలూ ధరించిన స్త్రీలు ... అట్టహాసంగా సాగిపోతున్న ఆ ఊరేగింపును ఆసక్తితో తిలకిస్తున్న జనం. ఇదంతా తన మనోనేత్రంముందు ఎప్పుడూ కదులాడుతూండే కమ్మని దృశ్యం.

తన బాబాయిగారి మాట వినివుంటె అన్నీ నిజమయ్యి, ఒక పెద్ద ఆఫీసరుతో పెళ్లయ్యి పెద్ద బంగళాలో నౌకర్లతో పని చేయించుకుంటూ, కార్లో షికారుకొడుతూ మహారాణిలా జీవించగలిగేది తను. కాని తను ఎన్నుకున్న మార్గం అది కాదు. దానికి పూర్తిగా విరుద్ధం.

ఒకనాటి మిట్టమధ్యాహ్నం మండుటెండలో ప్రకాశంతో కలసి ఊరిబయటవున్న గుడికి వెళ్లింది తను. చెమటలు కారుతున్న మొహాలతో ఒకరినొకరు ఆప్యాయంగా చూసుకుని దైవసాన్నిధ్యంలో పూలదండలు

మార్చుకున్నారు. అంతే! తమ పెళ్ళి తంతు ముగిసిపోయింది. పెళ్ళికి హాజరైన ప్రకాశం మిత్రులు నలుగురు కాస్త స్వీట్సు పంచి పెట్టి పెళ్ళి అయిందనిపించేశారు.

తను కన్న కలలన్నీ కరిగిపోయినా, ప్రకాశంవంటి సహృదయుడు భర్తగా లభించాడన్న ఆనందంతో అన్నీ మరచిపోయింది తను.

'అమ్మాయ్ సుశీలా... ఏం చేస్తున్నావ్ ఇక్కడ? ఇంకా ఇలాగే వున్నావేం? అబ్బాయి వచ్చేవేళకి మంచి చీర కట్టుకుని, నవ్వుతూ వుండొద్దూ?' అంటూ తన మాటలకు తనే పెద్దగా నవ్వింది సుశీల అత్తగారు.

సుశీల వెనక్కితిరిగి ఆవిడవైపు మరుగ్గా చూసింది.

అత్తగారట ... అత్తగారు! ఒకనాడు మెడలో పూలదండలతో ఇంటికి వచ్చిన కొత్తకోడలిని బయటికి తరిమిన అత్తగారు ఈనాడు అంతులేని ఆప్యాయత పొలకబోస్తోంది.

సుశీలకు మళ్ళీ పన్నెండేళ్ళ క్రితం జరిగిందంతా గుర్తుకొచ్చింది.

...ఆ రోజు గుళ్ళో పెళ్ళి చేసుకుని తిన్నగా ప్రకాశం ఇంటికి వెళ్ళారు. తామింకా గడప దగ్గరకన్నా వచ్చారో లేదో ఆవిడ దండకం ప్రారంభించింది. తనను అనరాని మాటలన్నీ అంది. వంచకురాలంది. వగలమారంది. కొడుకును వలలో వేసుకున్న వన్నెల విసనకర్రంది ... తను అన్నీ విని మౌనంగా వూరుకుంది. మరదులు, ఆడపడుచులు కూడా తల్లితో కలిసి తూలనాడుతూంటే ప్రకాశం భరించలేకపోయాడు. కోపంతో ఊగిపోతూ తమ్ముళ్ళూ, చెల్లెళ్ళ మీదికి లేచాడు. అప్పుడు తనే అతనికి అడ్డు తగిలింది. వద్దని వారించింది. తను అన్నిటికీ అలా సహించి వూరుకునేసరికి అత్తగారికి ఉక్రోషం వచ్చి, ఇద్దరిమొహాన తలుపు వేసుకుంది. ఆనాటినుంచీ ఈనాటివరకూ తను మళ్ళీ ఆ గడప తొక్కలేదు...

అలాంటి అత్తగారు ఈనాడు తనమీద ఎక్కడలేని ఆప్యాయతా ఒలకబోస్తోంది.

సుశీల గదిలోకెళ్ళి తల దువ్వుకుని, చీర మార్చుకుని, తిరిగి ఇవతలికి వచ్చి ఆ పని ఈ పని చూడసాగింది. ఇంటినిండా చుట్టాలూ, స్నేహితులూ నిండిపోయారు. ఇదుగో ఇక్కడ కాలికడ్డు పడుతున్న వాళ్ళను చూస్తూంటే సుశీలకు చిరాకేసింది.

వినాలన్న తలంపు లేకపోయినా, వాళ్ళ మాటలు చెవిన పడుతున్నాయి.

'ప్రకాశం అదృష్టవంతుడని నేనెప్పుడో అనుకున్నా. చక్కటి భార్య, ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు ... ఇప్పుడిహ జిల్లా పరిషత్ చైర్మన్‌కూడా అయ్యాడు. ఇంకేం లోటు ?...'

'అదంతా సుశీల వచ్చిన వేళావిశేషం!'

సుశీల పళ్ళు పటపట కొరుక్కుంది. పన్నెండేళ్ళక్రితం తనను దరిద్రపు మొహమని తిట్టిన పెద్దాడబడుచు నోట్లోంచి వచ్చినమాట అది.

'మీరు మరీ అలసిపోయారు. కాసేపు విశ్రాంతి తీసుకోండి.' దూరపుబంధు వొకాయన ఇచ్చిన ఉచితసలహా!

'ఏమిటీ మనుషులతీరు! వీరెందుకింత విచిత్రంగా ప్రవర్తిస్తారు? ఇన్నేళ్ళూ తమను 'చచ్చారా... బతికారా' అని అడిగిన దిక్కులేదు. ఇప్పుడుమాత్రం అందరికీ ఒకేసారి ప్రేమ పుట్టుకొచ్చింది కాబోలు!

సుశీల మళ్ళీ డాబామీదికి వెళ్ళి తొంగి చూసింది. దూరంగా ఆరోడ్డు మలుపులో ఊరేగింపు తాలూకు మనుషులు కనిపిస్తున్నారు.

అంతలో పెద్దకొడుకు రవి పరుగెత్తుకొచ్చి 'అమ్మా, నాన్నారు వస్తున్నారమ్మా. ఊరేగింపు దగ్గరకొచ్చేస్తోంది. అబ్బ! నాన్నగారి మెడలో ఎన్ని పూలదండ లేశారనుకున్నావ్?' అని సంబరంగా చెప్పి మళ్ళీ పరుగెత్తాడు.

అసలీరోజు తను ఎంతో సంతోషంగా వుండాల్సిన రోజు. మరి ఎందుకిలా తన మనసు గతాన్ని తవ్వుకుంటోంది? పెళ్ళయినప్పటినుంచీ తను ఎన్ని అవమానాలు భరించలేదు? అయినా తనకేనాడూ ఇంతగా మనోవేదన కలగలేదే? ఎవరేమన్నా అన్నీ సహించి వూరుకుంది. కనీసం వాళ్ళకు జవాబుకూడా చెప్పకూడదన్నంతగా అసహ్యం కలిగింది తనకప్పుడు.

పెళ్ళిళ్ళకూ, పేరంటాలకూ వెళితే అందరూ వింతగా చూసేవాళ్ళు. బహుశా తనులా ఖరీదైన పట్టుచీరలూ, నగలు ధరించలేదని కాబోలు! తనెక్కడున్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. తన పిల్లలు ఎంత ముద్దుగా వున్నా పలకరించే వాళ్ళుగాదు. కాని ఈరోజు మాత్రం అందరూ తననూ, తన పిల్లలనూ ఎక్కడలేని ఆపేక్షతో చూస్తున్నారు.

తనిప్పుడు జిల్లాపరిషత్ చైర్మన్ భార్య కదా? రేపు తన ద్వారా తన భర్తతో ఎన్నోపనులు చేయించుకో వచ్చన్న ఆశ!

'మా తమ్ముడు నిన్నేం పెళ్ళాడలేదు. ఊరికే ఉంచుకున్నాడంతే' అని తన మొహం మీదే నిర్మొహమాటంగా చెప్పిన బావగారూ, పెద్దాడబడుచూ ఇప్పుడు స్వయంగా నిలబడి ఇల్లంతా సర్దిస్తూ వున్నారు.

పరిచితులు పూలహారాలు చేతబట్టుకుని ప్రకాశంరాకకై ఎదురు చూస్తున్నారు.

వాళ్ళను చూస్తూంటే నవ్వొచ్చింది సుశీలకు.

తామిన్నాళ్ళూ ఎన్నో కష్టాలనుభవించారు. అప్పుడు ఒక్కరూ తమ ఇంటి గడప తొక్కిన పాపాన పోలేదు. వున్న ఊళ్ళోనే పుట్టిల్లూ, అత్తవారిల్లూ వుండీ కూడా నా అన్నవారు లేకపోయారు తమ ఇద్దరికీ.

ప్రకాశంది మరి గుమాస్తాగిరి కాకపోయినా, సంఘసేవ చేయాలనే ఉబలాటంలో పడి వున్నదంతా పోగొట్టుకున్నాడు. ఎవరికే ఉపకారం కావాలన్నా వేళతో నిమిత్తం లేకుండా చేసి పెట్టేవాడు ప్రకాశం. మొదట్లో తనకిది బాధగా వున్నా భర్త చేస్తున్నది మంచిపని కావడంవల్ల అతనికి అన్నివిధాలుగానూ సహకరిస్తూ, అతని ఆనందమే తన ఆనందమని భావిస్తూ అతని నీడలా మసలుకుంది.

హోదా, అంతస్తుల కోసం ఎప్పుడూ ఆశపడలేదు తను. గొప్ప గొప్ప వాళ్ళని పెళ్ళి చేసుకున్న తన స్నేహితురాళ్ళందరూ తనను చూసి జాలి పడ్డారు; సానుభూతి కురిపించారు. తనేమీ వాళ్ళనుండి సానుభూతిని ఆశించలేదు. ఇంతకూ తను చేసిన తప్పేమిటి?

తను ప్రకాశాన్ని ప్రేమించింది. అతనూ తనను అంతకంటె గాఢంగా ప్రేమించాడు. తల్లీ—తండ్రీ కరువయిన తనను చిన్నప్పటి నుంచీ పెంచి పెద్దచేసిన బాబాయి ఐశ్వర్యంకంటె, అంతస్తుకంటె అందమూ, గుణమూ తనకెక్కువ

...ంచాయి. కులాలు వేరయినా మనసులు మాత్రం ఒకటయ్యాయి. పెద్దల ఇష్టానికి వ్యతిరేకంగా వలచుకున్నందుకు ఫలితంగా కట్టుబట్టలతో ఇద్దరూ బయటికి రావలసి వచ్చింది అంతే!

'అమ్మా, అమ్మా—మరేం...మనందరినీ తాతయ్యా వాళ్ళింటికి తీసుకుపోతారుటే! నిజం. బాబాయి, నాయనమ్మ అందరూ చెబుతున్నారు.' అని సుశీల చిన్నకొడుకు గోపి వచ్చి చీరకుచ్చెళ్ళు పట్టి లాగుతూ చెప్పాడు.

సుశీల ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చింది. కొడుకు తలను ప్రేమగా నిమిర్చి వాడివేపు జాలిగా చూసింది ...వెర్రితండ్రి! పుట్టినప్పటి నుంచీ అమ్మా, నాన్నా! ఇద్దరు తప్ప మరెవరి ప్రేమనీ ఎరగని ఆ పసిమనసు తనవాళ్ళను చూడగానే పొంగిపోతోంది. వాళ్ళ ప్రేమలెలాంటివని ఆ అమాయకుడికేం తెలుసు?

ప్రకాశం ఇంక మాటలకు మాటలే డబ్బు సంపాదించేస్తాడని వాళ్ళ అంచనా! అంతా పెళ్ళాం బిడ్డలకే కాకుండా తమకు కూడా పెట్టాలని తమ్ముళ్ళూ, చెల్లెళ్ళ ఆలోచన...

సుశీల తల గట్టిగా విదిలించి తనను తానే తిట్టుకుంది. ఏమిటీ పాడు ఆలోచనలు తనకు? ఇన్నేళ్ళుగా లేని బాధ ఈ రోజెందుకు తననిలా వేధిస్తున్నాయి? తనను చూసి వచ్చినవాళ్ళందరి ముందూ గర్వంగా తలెత్తుకుని తిరగాల్సిన రోజులొచ్చాయి తనకు. అయినా అందరినీ వదలి ఇలా ఒంటరిగా ఆలోచనల్లో మునిగి తేలుతోందేమిటి తను?

సుశీలకు సన్నగా గుండెనొప్పి ప్రారంభమయింది. ఇహ తనీ బాధ భరించలేదు. జరిగినదంతా మరచిపోయి గుండె దిటవు చేసుకుని తనూ వాళ్ళల్లో కలిసిపోవాలి. అంతకన్నా వేరే గత్యంతరం లేదు...

వచ్చిన బంధువుల్లో ఒకామె సుశీల దగ్గరకొచ్చి 'ఏం వదినా, అప్పుడే మమ్మల్నందర్నీ మర్చిపోయావా? అవున్లే.. నువ్విప్పుడు గొప్పదానివయిపోయావు కదా, మాటివాళ్ళను మర్చిపోవడం సహజమే!' దెప్పుతున్నట్టు.

అంత వస్తున్న కోపాన్నణచుకుని అంది:

'ఏం లేదొదినా, నే నెప్పుడూ ఒకే రకంగా వుంటాను. కావాలనుకున్నప్పుడు ఆపేక్ష ఒలకంబోయడం, అక్కర్లేనప్పుడు మొహం తిప్పుకోవడం నా కలవాటు లేదు.'

జవాబు కాస్త ఘాటుగా వుండడంతో ఆవిడ మొహం చిన్నబోయింది. కాని తన అంతర్యం బయటపడడం ఇష్టంలేక 'అబ్బే, అలా అనలేదొదినా నేను. మరీ అంత పరాగ్గా వుంటేనూ వేళాకోళాని కన్నానంతే!' అని చల్లగా జారుకుందావిడ.

సుశీల కూడా లోపలికొచ్చింది. మనసులోని ఆలోచనలన్నీ కాసేపు దులిపేసుకుని హుషారుగా వుండడానికి ప్రయత్నించింది.

ఇప్పుడు ఊరేగింపు మరీ దగ్గరకు వచ్చేసినట్టు చెవులు బద్దలు చేస్తున్న బాండ్ చప్పుడే చెబుతోంది. అందులో పాల్గొన్నవాళ్ళంతా ఇప్పుడు ఇంటికి వస్తారు.

## దసరా పాట

పలక బలపం మూలజేరగ
గిలక పగ్గం చేత బడుతూ
విజయగీతం పాడబోయే
తమ్ముడూ! నామాట వినవోయ్!

పావలర్ధా పప్పు బెల్లం
అయిదు వరహాలయ్యగారూ
పిలకమీదా పీట మీదా
పాత పాటలు పాడవలదోయ్!

బుట్టనిండా పెట్టివుంచిన
పత్రి బుక్కా చిమ్మ వలసిన
తరుణమేదో తెలుసుకొంటూ
ఐకమత్యము చాటవలెనోయ్!

లోక కంటకు సంహరించిన
ఆదిశక్తిని తలచుకొంటూ
ఆయుధాలను పట్టినప్పటి
సవ్యసాచిగ సాగవలెనోయ్!

గుండె గుండెకు వెలుగు నిచ్చుచు
మానవత కారతులు పట్టుచు
వసుమతీ దరహాస మెసగగ
ధర్మకాహళి నొత్త వలెనోయ్

వర్తమానం వేది మీదను
భూతకాలపు పాటలెందుకు?
ప్రగతి పథరథచోదకుడవై
కొత్తగా గొంతెత్త వలెనోయ్!

—పైడిపాల

వాళ్ళకంతా తగినట్టు మర్యాదలు చేసి పంపాలి.. తను మరీ ఇలా పరాకుగా వుంటె కుదరదు.

సుశీల శరీరంలో నవచైతన్యం ప్రవేశించింది. గుండెనొప్పి లోలోన బాధిస్తున్నా లెక్కచేయకుండా పనిలో పడింది. ఇంత సేపుగావున్న నిర్లిప్తతా, నిరుత్సాహం పోయింది. చుట్టూ వున్నవాళ్ళందరూ తన ఉనికిని గొప్పగా గుర్తిస్తూంటె ఏమిటో కొత్తగా అనుభూతి కలగసాగింది.

తనభర్త వచ్చేవేళకు నవ్వుమొహంతో ఎదురు వెళ్ళాలనీ, అతనితో తనొకర్తే ఏకాంతంగా వుండాలనీ, అతని ఆనందంలో తనూ పాల్గొనాలనీ ఇలా ఏమిటేమిటో వింతకోరికలు కలుగసాగాయి ఆమెకు.

అప్పుడే పెళ్ళయిన కొత్త పెళ్ళికూతురిలా తనలో తనే సిగ్గుపడిపోయింది సుశీల.

ఆ సంతోష సమయంలో అనుకోని దుర్వార్త ఒకటివచ్చి ఆమెచెవిన పడింది.

ప్రకాశం అభిమానులు అతన్ని మరీ ఆకాశానికెత్తి అంత ఘనంగా ఊరేగించడం అతని ఎదురుపార్టీ వాళ్ళకు కంటగింపయింది. పెద్ద పెద్ద కర్రలు పట్టుకుని ఒక ఇరవైమంది పోగయివచ్చి ఒక్కసారిగా కలియబడ్డారు. క్షణంలో వాతావరణమంతా భీకరంగా తయారయింది. వెంటనే పోలీసులు రావడం, దుండగులను లాఠీఛార్జీతో చెదరగొట్టడం — అన్నీ జరిగిపోయాయి. ప్రకాశానికి దెబ్బలు తగిలాయని అతన్ని ఊరేగించుతున్న కారులోనే ఆస్పత్రికి తీసుకెళ్ళిపోయారు.

ఈ సంగతి వినడంతోటే సుశీల 'అమ్మో...' అంటూ గుండెను చేత్తో అదిమి పట్టుకుని కుప్పకూలిపోయింది.

'అయ్యో ... అయ్యో! సుశీల పడిపోయింది.' అని ఎవరో కేకెట్టగానే ఇంట్లో వున్న వాళ్ళందరూ పరుగెత్తుకొచ్చారు. ఆమెను ఇవతలికి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టి చుట్టూ చేరారు. క్షణంలో ఇంటి వాతావరణమంతా గంభీరంగా మారిపోయింది.

ఎవరోవెళ్ళి డాక్టరును పిలుచుకొచ్చారు. డాక్టరు ఆమెనాడీని పరీక్షచేసి జరిగిన సంగతి తెలుసుకున్నారు.

'ఈమె గుండె చాలా బలహీనమైనదని మీ కెవరికీ తెలీదా? సంతోషమైనా, దుః

మైనా విక్కున్నవయితే భరించలేదామె ఇప్పుడు భర్తకు జరిగిన ప్రమాదం తెలియగానే ఆమెగుండె ఆగిపోయింది. పాపం!' అని లేచి వెళ్ళిపోయాడు.

ఇంటినిండా వున్న చుట్టాలందరూ ఈ విపరీత పరిణామాలకు తట్టుకోలేక అప్రతిభులై ఎక్కడి వాళ్ళక్కడ స్తంభించి పోయారు.

ప్రకాశానికి తగిలిన దెబ్బలు అంత బల

## ఊరేగింపు

మైనవి కాకపోవడంచేత కట్టుకట్టేసి ఇంటికి పంపించివేశారు.

కారు తన ఇంటిముందుకు రాగానే అక్కడి దృశ్యాన్నిచూసి కొయ్యబారిపోయాడు ప్రకాశం.

సుశీలను ముందుగదిలో పడుకోబెట్టారు చుట్టాలందరూ చేతికరకరకాలుగా ఏడు




స్తున్నారు. పిల్లలు ముగ్గురూ తల్లిదగ్గర కూర్చుని భోరున విలపిస్తున్నారు.

ప్రకాశం లోపలికి అడుగెట్టగానే 'నాన్నా!' అంటూ పిల్లలూ, 'నాయనా ప్రకాశం...' అంటూ తల్లీ అతనిదగ్గరికి చేరారు.

'సుశీల నీకిలా అన్యాయం చేసిపోతుందని నేననుకోలేదురా... ఇప్పుడీ పిల్లలగతేమిటి?' అంటూ అతనితల్లి విలపించ సాగింది.

ప్రకాశం ఊహించని ఈ ఘోరం చూసి పిచ్చివాడే అయిపోయాడు. సుశీలకేసి కళ్ళప్పగించి చూస్తూ అలా నిలబడి పోయాడు.

అసలు ఈ రోజు చావవలసింది తను. ఏదో అదృష్టంకొద్దీ ప్రమాదంనుంచి బయటపడ్డానని సంతోషించేసరికి ఈ ఘోరం జరగాలా? ఏం జరిగిందసలు? సుశీల ఎందుకిలా హఠాత్తుగా కన్నుమూసింది? ఆమెకు కొన్నేళ్ళుగా అప్పుడప్పుడు గుండెనొప్పి వస్తూవుండేది. కాని అదిలా ఒక్కసారిగా ఆమె ప్రాణాన్నే బలి తీసుకుంటుందని తనేనాడైనా ఊహించాడా?

ప్రకాశం భోరున ఏడ్చేశాడు.

రాత్రంతా ఇలా ఏడుపులతోనూ, ఓదార్పులతోనూ గడచిపోయింది.

* · * *

తెల్లవారగానే ప్రకాశం బంధువులు సుశీల అంత్యక్రియలకు ఏర్పాటు చేయసాగారు. ఇదివరకయితే ఎలా జరిగివుండేదో గాని ఇప్పుడు మాత్రం సుశీల జిల్లాపరిషత్ చైర్మన్ భార్యకావడంతో పెద్దఎత్తున ఏర్పాట్లు కావింపబడినాయి. స్నానం చేయించి కొత్తబట్టలుకట్టి, పసుపుకుంకుమ పూలతో అలంకరించారు.

మొహంనిండా పసుపుతో, నుదుట పెద్దబొట్టుతో, వంటినిండా పూలతో మహాలక్ష్మిలా వెలిగిపోతున్న సుశీలమొహం తన చిరకాలవాంఛ నెరవేరుతోందని కాబోలు ప్రశాంతంగా కనిపిస్తోంది. సజ్జీవంగా వున్నప్పుడు ఊరేగింపు వెళ లేదని బాధపడిన సుశీల మరణించిన తరువాత బాజాభజంత్రీలతోనూ, బంధుమిత్రులతోనూ ఘనంగా ఊరేగించుకుంటూ ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది. ●